క్లుప్తంగా

నెలాఖరు వరకే వడ్డీ రాయితీ పన్ను చెల్లింపులు

నగర కార్పొరేషన్ కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఏక మొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లిస్తే, వాటిపై వడ్డీని మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఈ నెలాఖరు వరకే గడువు ఉందని నగర కమీషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో నిర్మాణంలో భవన యజమానులకు ఖాళీ స్థల పన్నుపై వడ్డీ రాయితీ సదవకాశమని, వెంటనే పన్ను చెల్లించాలని పేర్కొన్నారు. మార్చి తర్వాత వడ్డీ కలిపి చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. పన్ను చెల్లింపుదార్లకు వీలుగా నగర పాలక సంస్థ ప్రధాన, సర్కిల్ కార్యాలయాలతో పాటుగా భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్‌లోని 148 వార్డు సచివాలయాల్లో క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, నీరు, ఖాళీ స్థలం పన్నులు, నీటి మీటర్ చార్జీలు, డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

కేర్ కిట్‌ల పంపిణీ



గుంటూరు మెడికల్: నవజాత శిశు సంక్షేమ హోం బేస్డ్ నియోనేటల్ కేర్ కిట్‌లను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి వైద్య సిబ్బందికి అందజేశారు. గుంటూరు డీఎంహెచ్‌ఓ ఛాంబర్‌లో జిల్లాలో పనిచేస్తున్న 1,180 మంది ఆశా కార్యకర్తలకు నియోనేటల్ కేర్ కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త ఈ కిట్‌ను ప్రతి బాలింతకు అందజేయాలన్నారు. బాలింత ఇంటిని సందర్శించి వాటిలోని ప్రతి ఐటమ్ ను ఏ విధంగా వినియోగించాలో బాలింతలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్‌ఓ శాంతకుమారి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ ఏఓకు సన్మానం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ పరిపాలనా అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దేవరపల్లి ప్రతాప్ కుమార్‌ను భీమ్ భారత్ రాష్ట్ర నేతలు కలిసి, సత్కరించారు. భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్, భీమ్ భారత్ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు అంకం శ్యామ్, షెడ్యూల్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు అంబటి అనిల్, పోపూరి చిన్నబాబు తదితరులు కలిసి అభినందనలు తెలిపారు .

పరీక్ష కిట్లు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: నంది వెలుగు రోడ్డులోని ఏపీ రెసిడెన్షియల్ మైనార్టీ బాలుర పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు మంగళవారం నవీన్ టైలర్స్ నిర్వాహకుడు మొహమ్మద్ నజీర్ సహకారంతో సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపల్ జయప్రకాష్, సిరాజ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నెహ్రూ నగర్: కామ్రేడ్ నాదెండ్ల బ్రహ్మయ్యను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం లాడ్జి సెంటర్లో బ్రహ్మయ్యను హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బ్రహ్మయ్యను నమ్మకంగా తీసుకువెళ్లి హత్య చేసిన నిందితులకు కఠిన శిక్ష పడేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. నిందితులు ఎంతటి వారైనా అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నల్లపు నీలాంబరం, స్టాలిన్, బత్తుల అనిల్ కుమార్, సురేష్, మంచాల జోసెఫ్, చిన్నం డేవిడ్ విలియమ్స్, పాగళ్ల ప్రకాష్, జయసుధ, విజయరాజు, ప్రభుదాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా

పాత గుంటూరు: కాంగ్రెస్ పార్టీకి పీసీసీ ప్రధాన కార్యదర్శి, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిరెడ్డి జగన్ మోహన్ రెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావుకు మంగళవారం రాజీనామా లేఖను అందించారు. గత నలభై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నానని, కొంతమంది చీడపురుగు లాంటి వ్యక్తుల వల్ల కష్ట, నష్టాలు ఎదుర్కొంటున్నానని లేఖలో పేర్కొన్నారు. ఈ కారణాల వల్ల పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పీసీసీ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నానని, తన ఆవేదనను అర్థం చేసుకొని రాజీనామాను ఆమోదించాలని కోరినట్లు ప్రకటనలో తెలిపారు.

రాజన్న ఆశయ సాధనే ధ్యేయం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా



ర్యాలీగా వెళ్తున్న చైతన్య, విద్యార్థులు

- విలువలు, విశ్వసనీయత గల వైఎస్సార్ సీపీ
- శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: దివంగత మహా నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధన కోసం.. విలువలు, విశ్వసనీయతతో.. పేదల జీవితాల్లో మార్పు తేవాలన్న లక్ష్యంతో.. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా.. ఆవిర్భవించిన పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని ప్రభుత్వ విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు. ఆవిర్భావం నుంచి ప్రజల పక్షాన నిలబడటంతో పాటు ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న ఏకైక పార్టీ అని స్పష్టం చేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, పార్టీ ముఖ్య నేతలు, కార్పొరేటర్లతో కలిసి లేళ్ల అప్పిరెడ్డి కేక్ కట్ చేశారు. మహానేత వైఎస్సార్ మరణానంతర పరిస్థితులు.. శరవేగంగా మారిన రాజకీయ పరిణామాలు.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒంటరిగా 2011 మార్చి 12న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన నేపథ్యాన్ని వివరించారు. నాటి నుంచి ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా... 2014లో కొద్దిపాటి తేడాతో ఓడిపోయినా... ఏమాత్రం వెరువక ఆశయ సాధనా పథంలో పార్టీని 2019లో జయప్రదంగా గెలుపు తీరానికి చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందని కొనియాడారు. పార్టీని అధికారంలోకి తెచ్చి తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పేదరిక నిర్మూలన కోసం సీఎం జగన్ చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. ఈ క్రమంలో జరగనున్న ఎన్నికల్లో 175కి 175 అసెంబ్లీ స్థానాలతో పాటు 25కి 25 పార్లమెంట్ స్థానాలను వైఎస్సార్ సీపీ చేజిక్కించుకుని క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ, వంగల హేమలతా, వలి వీరారెడ్డి, వెంకటరత్నం, షేక్ రోషన్, సుబ్బారెడ్డి, రమేష్, గురవయ్య, సంతోష్, వెంకటరెడ్డి, పద్మావతి, మారుతీ కోటి లింగారెడ్డి, మార్కెట్ బాబు, స్మిత పద్మజ, బూసి రాజలత, టీఎల్వీ వీరాంజనేయులు, కృష్ణబలిజ కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని, గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, అన్నదాన సత్రం చైర్మన్ పోకల వసంత్, పార్టీ నేతలు శ్రీనివాసరావు, జోసఫ్, శ్రీనివాసరెడ్డి, ఝాన్సీ పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆవిర్భవించిన వైఎస్సార్ సీపీ

పట్నంబజారు: పేదల పక్షాన కొండంత అండగా నిలుస్తూ..రాష్ట్ర భవిష్యత్తు కోసమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఆవిర్భించిన వైఎస్సార్ సీపీ 13 వసంతాలు పూర్తి చేసుకుని 14వ వసంతంలోకి అడుపెట్టడం సంతోషదాయకమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని తిరుగులేని మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ సవాళ్లనే సోపానాలుగా మలుచుకుని వైఎస్సార్ సీపీని తిరులేని శక్తిగా మార్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరక్టర్‌లు, క్లస్టర్, మండల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

విద్యార్థుల మేలు కోసమే పుట్టిన వైఎస్సార్ సీపీ

పట్నంబజారు: విద్యార్థుల మేలు కోసమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని ఆ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలకు గుంటూరు నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. చైతన్య నేతృత్వంలో భారీ ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి సీఎం జగనన్న బంగారు బాటలు వేశారని కొనియాడారు. ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వులు చూడడం కోసం, విద్యార్థుల తలరాతలు మార్చడం కోసం అలుపెరుగక కృషి చేస్తున్న జగనన్నను తిరిగి ముఖ్యమంత్రి చేసుకుంటామని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నేతలు విఠల్, వినోద్, బాజీ, గంటి, జగదీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో వెనకడుగు ప్రసక్తే లేదు

తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా



శంకుస్థాపన చేస్తున్న నూరి ఫాతిమా, పార్టీ నేతలు

పట్నంబజారు: అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా స్పష్టం చేశారు. ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఆదేశాల మేరకు మంగళవారం 15వ డివిజన్ పరిధిలోని సాయికృష్ణ నగర్‌లో కార్పొరేటర్ రామన బోయిన అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో సీసీ డ్రెయిన్‌లు, రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ రూ. 1.88కోట్ల వ్యయంతో సీసీ డ్రెయిన్లు, రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, పచ్చపార్టీ టీడీపీ నేతలు పచ్చకామెర్లు వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు రాంబాబు, బత్తుల రాము, మస్తాన్, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, మాబు సుభాని, ఖాజారెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. హనుమాన్‌నగర్‌కు చెందిన వసంత కార్తీక్ (34) ఈ నెల 9న నగరంపాలెం ఎస్‌బీఐ ఏటీఎం వద్ద తీవ్ర అవస్థతతో పడి ఉన్నాడు. స్థానికులు 108 సహాయంతో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 11న మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

మహిళల్లో మరింత చైతన్యం రావాలి



తెనాలిఅర్బన్: మహిళల్లో మరింత చైతన్యం రావాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తెనాలిలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయలలో మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ పురుషులతో సమానంగా స్త్రీలు కూడా అన్ని రంగాల్లో ప్రవేశించడం అభినందనీయ మన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ అధ్యక్షురాలు పి.సౌజన్య, నాయకులు ఎఎస్.కుసుమకుమారి, బి.ఆదిలక్ష్మి, గయాసుదౌలా, బాబుప్రసాద్, కామాక్షి, సాంబశివరావు, కేదార్‌నాథ్, బసవేశ్వరరావు, అహ్మద్‌హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమగ్రాభివృద్ధికి యునెస్కో క్లబ్ కృషి



పురస్కార గ్రహీతలతో పరమేశ్వరరావు, జ్యోత్స్నకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన స్వచ్ఛంద సేవా సంస్థ 'యునెస్కో క్లబ్స్' మహిళా విద్య, ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు విశేషంగా కృషి చేస్తున్నాయని యునెస్కో క్లబ్స్ జిల్లా అధ్యక్షుడు రామనాథం పరమేశ్వరరావు పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం జిల్లా యునెస్కో క్లబ్ 27వ వ్యవస్థాపక, మహిళా దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో కృషి చేస్తున్న మహిళలను స్త్రీ శక్తి అవార్డులతో సత్కరించారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పురుషులకు వార్షికోత్సవ పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, ఆకాశ వాణి డిప్యూటీ డైరెక్టర్ జి.కొండలరావు, విద్యావేత్త ఏపీకే సుజాత, క్లబ్ ప్రధాన కార్యదర్శి జె.శ్రీనీలత, కోశాధికారి కె.లక్ష్మీ శైలజ, డాక్టర్ ఎం.సంతోషికుమారి, డాక్టర్ శైలజ, డాక్టర్ షాహిదా, యూపీఐ సీనియర్ మేనేజర్ రాజకవిత, సైకాలజిస్ట్ శ్రీహరి, సుభాషిని, రాధిక, పి ప్రియ శ్రీ పాల్గొన్నారు.

ఆశ్రమాలకు విశ్రాంత ఉద్యోగుల వితరణ



నిర్మల్ హృదయ్‌లో వృద్ధులతో విశ్రాంత ఉద్యోగులు

గుంటూరు ఎడ్యుకేషన్: సాధారణ బీమా విశ్రాంత ఉద్యోగుల సంఘం అమరావతి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రాడీపేటలోని నిర్మల్ హృదయ్ ఆశ్రమానికి సాధారణ బీమా విశ్రాంత మహిళా ఉద్యోగినులు, సహోద్యోగుల సహకారంతో 80 ప్లాస్టిక్ కుర్చీలు, అభినందన ఫౌండేషన్‌కు రెండు స్టీల్ బీరువాలు, మానవత సేవ సమితి వృద్ధుల ఆశ్రమానికి డైనింగ్ టేబుల్స్, అనురాగ్ వృద్ధుల ఆశ్రమంలోని మహిళలకు శానిటరీవేర్, మాతశ్రీ చిల్డ్రన్ హోమ్‌కు టీవీ అందించారు. వృద్ధులు, బాలలతో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమ సమన్వయకర్తలు ప్రేమ జ్యోతి, శారద, ప్రధాన కార్యదర్శి మన్నవ సాంబశివరావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు సామాజిక బాధ్యతతో తమ పెన్షన్‌లో కొంతభాగం పొదుపు చేసి, విద్యార్థులకు ఉపకార వేతనాలు, మహిళలకు ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. వాణి, సూర్యకుమారి, భాగ్యలక్ష్మి, శాంతకుమారి, జి.పానకాలరావు పి.సాంబశివరావు, చంద్రశేఖర్, ఎస్వీ సుబ్బారావు పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్‌లో కేఎల్పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణప్రసాద్, రథినీ చౌదరి

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం జేకేసీ కళాశాలరోడ్డులోని కేఎల్పీ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆదివారం చలపతి ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో పీఎస్‌వీ యశ్వంత్ రాజ్‌కుమార్, బి. ప్రజిల్, కె. ప్రణీత్ మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారని తెలిపారు. అదే విధంగా పి. చరణ్, ఎస్కే ఖాజామొహిద్దీన్, ఎన్. ధర్మిక, ఎస్కే హర్షద్ అలీ తరువాతి స్థానాల్లో నిలిచినట్లు వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వై. రథినీచౌదరి, ఏవో కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య అభినందించారు.

ఉత్తమ విద్యావేత్త పురస్కారం ప్రదానం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యా రంగంలో అందించిన సేవలకు గుర్తింపుగా మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్ ఉత్తమ విద్యావేత్త పురస్కారాన్ని అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ కేవీ సెబాస్టియన్ తెలిపారు. నగరంపాలెంలోని పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సెబాస్టియన్ మాట్లాడుతూ బీఎస్‌ఈ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఐటీసీ హోటల్‌లో వివిధ రంగాల్లోని మహిళలకు పురస్కారాలు ప్రదానం చేశారని పేర్కొన్నారు. పురస్కార ప్రదానోత్సవంలో పలువురు పారిశ్రామిక, వ్యాపారవేత్తలతో పాటు వివిధ రంగాల మహిళలు పాల్గొన్నట్లు తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి ప్రధాని వర్చువల్ సమావేశానికి ఏర్పాట్లు పూర్తి

గుంటూరు వెస్ట్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం దేశంలోని స్వయం సహాయక బృందం సభ్యులతో నిర్వహించనున్న ప్రత్యక్ష ప్రసార కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, మినిస్టర్ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ డీజీఎం తపస్ బారువ పరిశీలించారు. ప్రధాన మంత్రి వర్చువల్ కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూధనరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమకుమారి, డీఐఓ బిమల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికలయ్యే వరకు అందుబాటులో ఉండాలి

ఈఆర్ఓ, నగర కమిషనర్ చేకూరి కీర్తి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: గుంటూరు నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల వారీగా ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా సెలవులు తీసుకోకూడదని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఎన్నికల విధుల నిర్వహణపై పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఏఈఆర్ఓలు, సూపరింటెండెంట్‌లతో మంగళవారం తన చాంబరులో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల విధులకు కేటాయించిన వాహనాలకు జీపీఎస్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఈని, అభ్యర్థుల ప్రచార సామగ్రి ప్రింట్ చేసే ప్రెస్‌లకు ఎన్నికల నిబంధనల మేరకు తీసుకోవాల్సిన చర్యలపై నోటీసులు జారీ చేసి, వారితో సమావేశం నిర్వహించాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో వీడియో రికార్డింగ్ చేయడానికి తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, నామినేషన్లు స్వీకరించే గదుల్లో ఎస్ఈతో సమన్వయం చేసుకొని తగిన ఏర్పాట్లు చేయాలని మేనేజర్‌కు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఈ సుందరరామిరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏఈఆర్ఓలు సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, వెంకటలక్ష్మి, సునీల్, నిరంజన్, ఏడీహెచ్ రామారావు పాల్గొన్నారు.

2,339 దరఖాస్తులు పరిష్కారానికి ఆదేశం

నెహ్రూ నగర్: గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాజకీయ పార్టీల నాయకుల నుంచి అందిన ఫిర్యాదులు, అర్జీలను వెంటనే పరిష్కారించాలని నగర కమిషనర్, ఈఆర్ఓ కీర్తి చేకూరి ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితాపై అందిన అర్జీల పరిష్కరించేందుకు పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ కె.రాజ్యలక్ష్మితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అర్జీలను, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలన్నారు. ఈ నెల 4 నుంచి 10 వరకు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల వారీగా ఫారం 6, 7, 8 లు, షిఫ్టింగ్ దరఖాస్తులు 2,339 అందాయని వాటిని 2 రోజుల్లో పరిష్కారం చేయడానికి ఆదేశాలు జారీ చేశామన్నారు. పార్టీల ప్రతినిధులు సూచనల మేరకు తుది పోలింగ్ కేంద్రాల జాబితాను త్వరలో అందిస్తామన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి

నెహ్రూ నగర్: సెక్టోరల్ అధికారులు ఎన్నికల సంఘం నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని ఈఆర్ఓ కీర్తి చేకూరి తెలిపారు. సాధారణ ఎన్నికల విధులపై సెక్టోరల్, రూట్ అధికారులకు అదనపు పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ కె.రాజ్యలక్ష్మితో కలిసి కౌన్సిల్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 22 మంది సెక్టోరల్, 22 మంది రూట్ అధికారులకు విధులు కేటాయించామన్నారు. సెక్టోరల్ అధికారులు ముందుగా తమకు కేటాయించిన ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను రూట్ మ్యాప్ ప్రకారం పరిశీలించాలన్నారు. హ్యాండ్ బుక్‌ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు.

ఎన్నికల కోడ్ వచ్చిన అనంతరం జీఎంసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులకు, దివ్యాంగులకు వీలుగా ర్యాంపులు, విద్యుత్, తాగునీటి సరఫరా, మరుగు దొడ్లు వంటి కనీస వసతులపై దృష్టి సారించాలన్నారు.

రెండు రోజులు తాగునీటి సరఫరా నిలుపుదల

నెహ్రూ నగర్: తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ ప్రధాన పైప్ లైన్ లీకు మరమ్మతు పనులను చేపట్టనున్నారని, దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో గురు, శుక్రవారాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల పనుల కోసం హెడ్‌వాటర్ వర్క్స్‌ని పూర్తిగా నిలుపుదల చేయాల్సి ఉంటుందని తెలిపారు. నగరంలోని నెహ్రూ నగర్, శారదా కాలనీ, వసంతరాయపురం, హెచ్.ఎల్.ఆర్., ఐపీడీ కాలని, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల, విద్యా నగర్, హనుమయ్య నగర్, నల్లచెరువు, శ్రీనివాసరావు తోట, తారకరామ నగర్, ఏటి అగ్రహారం, బి.ఆర్.స్టేడియం, ఎల్.బి.నగర్, గోరంట్ల, అడవి తక్కెళ్లపాడు, రాజీవ్ గాంధీ నగర్, కోర్ట్ కాంపౌండ్, మిర్చి యార్డ్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కె.వి.పి.కాలని, శ్యామలా నగర్, రెడ్డిపాలెం రిజర్వాయర్ల ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం వరకు పూర్తిగా తాగునీటి సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. సాయంత్రం నుండి తాగునీటి సరఫరా యథావిధిగా జరుగుతుందన్నారు.

ఆలయాల అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యం



నిధుల పత్రాన్ని చూపుతున్న నూరిఫాతిమా, అధికారులు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలయాల అభివృద్ధి, పరిరక్షణకు పాటు పడుతున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా అన్నారు. ఈ మేరకు పాత గుంటూరు అంకమ్మ తల్లి దేవస్థానం పునః నిర్మాణానికి నూరి ఫాతిమాను దేవదాయ ధర్మదాయ శాఖ ద్వారా రూ. 1.20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసేలా కృషి చేశారు. ఈ క్రమంలో మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు నూరిఫాతిమాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేసిన ఆమెను సత్కరించారు.

మతమే పునాదిగా పౌరసత్వం రాజ్యాంగ విరుద్ధం



మాట్లాడుతున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అనంతరామయ్య

లక్ష్మీపురం: నాలుగేళ్ల నాటి పౌరసత్వ సవరణ చట్టాన్ని ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటానికి కాస్తంత ముందుగా ఆచరణలోకి తేవటం అధికార పక్షానికి రాజకీయంగా ప్రయోజనం చేకూర్చేందుకేనని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బీసీహెచ్ అనంతరామయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పౌరసత్వ సవరణ చట్టం అమలు ఇప్పుడు ఎందుకు అనే అంశంపై నిర్వహించిన చర్చలో మాట్లాడారు. దేశ చరిత్రలో తొలి సారిగా భారత పౌరసత్వ అర్హత పరీక్ష మతం ప్రాతిపదికన జరగబోతుందని, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు తగిన పత్రాలు లేకున్నా ఈ దేశ పౌరసత్వాన్ని కల్పించేందుకు ఈ పౌరసత్వ సరవణ చట్టంలో నిబంధనలు ఉన్నాయన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగ విధానాలకు భిన్నంగా ఇస్లామిక్ దేశాల నుంచి తరలి వచ్చిన ఆయా మతాల వారు అంటూ కొందరిని ప్రత్యేకించి, ఒక మతం వారిని వేరు పరచడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు. దేశ లౌకిక స్వరూప స్వభావాలకు భిన్నంగా నడుచుకోవడమే అన్నారు. అనంతరం పలువురు సంస్థ సభ్యులు, విశ్లేషకులు, మేధావులు తదితరులు చర్చలో పాల్గొన్నారు.